ప్రారంభానికి నోచుకోని

జీపీ భవనం

● అన్ని హంగులతో నిర్మాణం 8

● పనులు పూర్తయినా తీవ్ర జాప్యం





మోదుగు పూసింది ముచ్చటగా..

మోదుగుపూలు విరబూస్తున్నాయంటే శివరాత్రి, హోలీ పండుగలు సమీపిస్తున్నట్లే.. పరమశివుడికి మోదుగుపూలంటే చాలా ప్రీతీ. అందుకే శివరాత్రి పూజలో మోదుగుపూలు ఉండాల్సిందే. ఇక హోలీ పండుగను మోదుగుపూలతో తయారు చేసిన రంగుతో జరుపుకొంటారు. ప్రస్తుతం ఈ పూలు నిండుగా పూసి చూపరులను ఆకట్టుకుంటున్నాయి

- సిద్దిపేట జిల్లా స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి)



సంగారెడ్డిలోని అంబేడ్కర్ క్రీడా మైదానాన్ని పరిశీలిస్తున్న స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనరెడ్డి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి



స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనరెడ్డికి ప్రతిపాదనలు అందజేస్తున్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

అంబేడ్కర్ స్టేడియం అభివృద్ధికి రూ.32 కోట్ల ప్రతిపాదనలు

సంగారెడ్డిలో స్పోర్ట్స్ హాస్టల్, ఇండోర్ స్టేడియం, రన్నింగ్ ట్రాక్, అన్ని క్రీడలకు సౌకర్యాలు కల్పించాలి

స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డికి వినతిపత్రం అందజేసిన టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని బీఆర్ అంబేడ్కర్ స్టేడియం గ్రౌండ్ అభివృద్ధి కోసం రూ.32 కోట్లు మంజూరు చేయించాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనరెడ్డిని కోరారు. ఈమేరకు టీజీఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డితో కలిసి ఆయన ప్రతిపాదనలు అందజేశారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ గ్రౌండ్‌లో ఇండోర్ స్టేడియం, బాస్కెట్ బాల్, కబడ్డీ, షటిల్, చెస్, హ్యాండ్‌బాల్, వాలీబాల్, జిమ్, ఔట్ డోర్‌లో సింథటిక్ 800 మీటర్స్ రన్నింగ్ ట్రాక్, ఫుట్‌బాల్, హాకీ, ఖోఖో, బాక్స్ క్రికెట్ అన్ని క్రీడలను అభివృద్ధి చేసేందుకు గాను సుమారు రూ.32 కోట్లు అవసరం ఉంటుందన్నారు. ఈ నిధులను త్వరగా మంజూరు చేయించాలన్నారు. ఈ విషయంపై ముఖ్యమంత్రిని కూడా కలుస్తానని జగ్గారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోపాజీ అనంతకిషన్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి కూన సంతోష్‌కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ రామచందర్‌నాయక్, కంది మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మోతీలాల్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానం అవసరం

● విద్యార్థినులతో కలెక్టర్ మనుచౌదరి



విద్యార్థినులతో మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట కల్చరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలను కలెక్టర్ మనుచౌదరి మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. కళాశాలలోని తరగతి గదులు, లైబ్రరీ, వసతులను పరిశీలించారు. ఎమ్మెస్సీ కంప్యూటర్స్ మొదటి సంవత్సరం విద్యార్థులతో ఆ సబ్జెక్టుపై కొన్ని ప్రశ్నలు వేసి వారితో ఇంట్రాక్ట్ అయ్యారు. విద్యార్థుల కెరీర్లో సాంకేతిక పరిజ్ఞానం చాలా ఉపయోగకరంగా ఉంటుందని అధ్యాపకుల మార్గదర్శకత్వంలో అన్ని విభాగాలను శ్రద్ధగా చదువుకోవాలని సూచించారు. ప్రస్తుతం కళాశాలలో 325 మంది విద్యార్థినులు చదువుతున్నారని, క్లాసరూమ్‌లు సరిపోవడం లేదని కళాశాల ప్రిన్సిపాల్ జీవన్ కుమార్ కలెక్టర్ దృష్టికి తెచ్చారు. అదనపు తరగతి గదులు, విద్యార్థినుల కోసం ఒక హాస్టల్ కావాలని, ఒక సెమినార్ హాల్ ఉండాలని, కాలేజ్ చుట్టూ అసంపూర్తిగా ఉన్న ప్రహరీ నిర్మాణ పనులు పూర్తయ్యేలా చూడాలని కలెక్టర్‌ను కోరారు. ఈ సందర్భంగా కళాశాలకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. అనంతరం మహిళ డిగ్రీ కళాశాల పరిసరాల్లోని కాలనీలకు తాగునీరు అందించేందుకు ట్యాంక్ నిర్మాణానికి కళాశాల ఆవరణ, మియావకి ప్లాంటేషన్‌లో స్థలాన్ని పరిశీలించాలని సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్‌కు కలెక్టర్ సూచించారు

అనుమతులు లేకుండా

ఇసుక రవాణా చేస్తే చర్యలు : సీపీ

సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమ ఇసుక రవాణా చేసినా, డంపింగ్ చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ మంగళవారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. ఇప్పటికే అనేక ప్రాంతాల్లో దాడులు చేసి, నిబంధనలను ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఇసుక అక్రమ రవాణా చేసేవారిపై ప్రివెన్షన్ ఆఫ్ డ్యామేజ్ టు పబ్లిక్ ప్రాపర్టీ చట్టం, మైన్స్ అండ్ మినరల్స్ చట్టం ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేయ డం జరుగుతుందని తెలిపారు. ఇసుక అక్రమ రవాణా గురించి ప్రజలు సమాచారం అందించాలని, డయల్ 100, సిద్దిపేట పోలీస్ కంట్రోల్ రూం నంబర్ 8712667100 కాల్ చేసి సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

వినియోగం లేదా..?

● అలంకారప్రాయంగా వృద్ధాశ్రమం

● పేరుకే మహిళా ప్రాంగణం

● భవనాల చుట్టూ ఏపుగా పెరిగిన గడ్డి, పిచ్చిమొక్కలు

● ఫర్నిచర్ ఊసే లేదు.. ముందుకు రాని ఎన్‌జీవోలు

● ప్రారంభించి ఏడాదైనా ఇంకా ఎదురుచూపులే

● చోద్యం చూస్తున్న అధికారులు



సిద్దిపేటఅర్బన్ మండలంలో వినియోగంలోకి రాని వయో వృద్ధుల ఆశ్రమ భవనం

అనాథలకు, వృద్ధులకు ఆశ్రయమివ్వాలనే సంకల్పంతో నిర్మించిన భవనం.. ఆర్థికంగా మహిళలు రాణించాలన్న ఉద్దేశంతో పలు రంగాల్లో శిక్షణ ఇవ్వడానికి రూ.50లక్షలతో నిర్మించిన మరో భవనం అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి. మహిళల కోసం నిర్మించిన భవనం, వృద్ధాశ్రమ నిర్మాణాలు పూర్తి చేసుకుని ఏడాది గడుస్తున్నా వాటిని వినియోగంలోకి తీసుకురావడంలో అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. భవనాల చుట్టూ ఏపుగా పెరిగిన గడ్డి, పిచ్చిమొక్కలతో పాటు అసాంఘిక కార్యాకలాపాలకు అడ్డాగా మారుతున్నాయి.

- సిద్దిపేట టౌన్/ సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి)



వినియోగంలోకి రాని దుర్గాబాయి మహిళా శిశువికాస కేంద్ర భవనం

సిద్దిపేట అర్బన్ మండలం, మిట్టపల్లి సమీపంలో వృద్ధుల కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో, మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ప్రత్యేక చొరవతో వృద్ధాశ్రమాన్ని, మహిళల కోసం మహిళా ప్రాంగణాన్ని నిర్మించారు. ఎన్నో హంగులతో అత్యాధునికంగా నిర్మించిన భవనాలు సాధారణ ఎన్నికల కంటే ముందు ప్రారంభమయ్యాయి. ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఆ తర్వాత ఈ భవనాలు ఎవరూ పట్టించుకోలేదు. ప్రారంభించి దాదాపు ఏడాది కావస్తున్నా అధికారులు కన్నెత్తి చూడడం లేదు. వృద్ధాశ్రమంలో 100 పడకలు ఉండే విధంగా, నాలుగు పెద్దగదులు, వంట గది, డైనింగ్‌హాల్ నిర్మాణం చేపట్టారు. ఆశ్రమంలో ఆధ్యాత్మిక చింతన, ప్రశాంత వాతావరణంలో శేష జీవితాన్ని ఆనందంగా గడిపేందుకు సకల సౌకర్యాలను కల్పించారు. అయితే ఇప్పుడు ఆ భవనం కూడా అనాథగానే మిగిలిపోయిందని పలువురు విమర్శిస్తున్నారు. కనీసం ఓ వ్యక్తిని నియమించి భవనాన్ని సంరక్షించే బాధ్యతను అధికారులు చేపట్టకపోవడంతో స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పేరుకే మహిళా ప్రాంగణం

మహిళలు ఆర్థికంగా రాణించాలన్న లక్ష్యంతో అర్బన్ మండలంలోని ఎల్లుపల్లిలో ప్రత్యేకంగా మహిళా ప్రాంగణాన్ని ఏర్పాటు చేశా రు. అందులో మహిళలకు వివిధ అంశాలపై ఉచితంగా కోర్సులను అందించి ఆర్థికాభివృద్ధికి, మహిళల స్వయం ఉపాధికి, నైపుణ్య శిక్షణ కేంద్రాల నుంచి నేర్చుకున్న



చెత్తాచెదారం, పిచ్చిగడ్డితో చిందరవందరగా ఉన్న వృద్ధాశ్రమ భవనం

వాటి పై ఆర్థికంగా లాభపడేందుకు సహాయకంగా ఉంటుందన్న ఉద్దేశంతో భవనాన్ని నిర్మించారు. నిరాశ్రయులైన వారికి, వితంతువు, విద్యావంతులైన నిరుద్యోగ మహిళలలకు ఆర్థికసాధికారతకు శిక్షణ అందించేలా అన్ని ఏర్పాట్లు చేశారు. తెలంగాణ మహిళా సహకార అభివృద్ధి సంస్థ ద్వారా ఐసీడీఎస్ కార్యకర్తలు, కౌమారదశలో ఉన్న బాలికలు, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, సహాయకులకు ఈ భవనం అందుబాటులోకొస్తే నైపు ణ్య శిక్షణ అందిపుచ్చుకోవచ్చు. మంచి ఆలోచనతో నాడు రెండు భవనాలను నిర్మిస్తే నేడు మాత్రం అవి పూర్తిగా నిరుపయోగంగానే మిగిలిపోయాయి.

ముందుకు రాని ఎన్‌జీవోలు

ఎలాంటి లాభపేక్షాలు ఆలోచించకుండా సమాజంలో సేవా కార్యక్రమాలను

మిగతా 8వ పేజీలో...



మోతే గ్రామం

పుకార్ల మోతే!

● వరుస మరణాల ఆసరాగా వివాదాలు

● ఆ చావుల వెనుక ఆర్థిక, అనారోగ్య సమస్యలు

● ఇరువర్గాల మధ్య విభేదాలతో తప్పుడు ప్రచారం

● పుకార్ల కట్టడికి నేడు గ్రామసభ

ఒక్కొక్కరూ ఒక్కో కారణంతో చనిపోయారు. ఒకరిది ఆత్మహత్య అయితే, మరొకరిది అనారోగ్య సమస్య. గ్రామంలో ఒకే రోజు ఐదుగురు చనిపోవడం.. వరస మరణాలు వివాదాలకు కేంద్రంగా మారుతున్నాయి. పచ్చని పల్లెలో చిచ్చురేపుతున్నాయి. పుకార్లు శికార్లు చేస్తూ దేవాలయాలకు చుట్టుకుంటున్నాయి. అక్బర్‌పేట- భూంపల్లి మండలం మోతే గ్రామంలో ఒకే రోజు ఐదుగురు మృతి చెందడం, దాని వెనుక రాజకీయాలు.. విబేధాలు చోటు చేసుకోవడంతో మంగళవారం 'ఆంధ్రజ్యోతి' ఆ గ్రామానికి వెళ్లింది.

7 లో

కాళేశ్వరం ప్రాజెక్టుతోనే పంటలకు జలాలు

● మాజీ సీఎం కేసీఆర్ దూరదృష్టితోనే సాధ్యమైంది

● కాలువ పక్కన రైతులతో సెల్ఫీ దిగిన మాజీ మంత్రి హరీశ్‌రావు



రైతులతో సెల్ఫీ దిగుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

చిన్నకోడూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రైతులకు సకాలంలో సాగునీరు అందించేందుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషి చేసిందని, కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించడం వల్లే ప్రస్తుతం పంట పొలాలకు గోదావరి జలాలు అందుతున్నాయని మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. మంగళవారం మండలంలోని మెట్టుపల్లి శివారులో రంగనాయకసాగర్ రిజర్వాయర్ ఎడమకాలువ ద్వారా ప్రవహిస్తున్న గోదావరి జలాలను చూసి ఆయన ఆనందం వ్యక్తం చేశారు. కాలువ పక్కన ఆగి రైతులతో కలిసి సెల్ఫీ దిగారు. పొద్దుతిరుగుడు పంటలను సందర్శించి సాగు చేసిన రైతులతో మాట్లాడారు. రైతులు మార్కెటింగ్ సమస్యలు, పంటకు సరైన ధర లేకపోవడం వల్ల ఎదుర్కొంటున్న ఇబ్బందులను వారు ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీశ్‌రావు మాట్లాడారు. నిత్యం నీటి కొరతతో తిప్పలు పడే ఇక్కడి ప్రాంతాలు సాగునీటి సౌకర్యంతో పచ్చగా మారాయని, ఇది మాజీ సీఎం కేసీఆర్ దూరదృష్టితోనే సాధ్యమైందని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణితో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆరోపించారు. పొద్దుతిరుగుడు పంటకు తగిన మద్దతు ధర కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనన్నారు. వెంటనే ప్రత్యేక కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు గిట్టు బాటు ధర అందించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణశర్మ, మండలాధ్యక్షుడు శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ కనకరాజు, మాజీ వైస్ ఎంపీపీ పాపయ్య, మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధికి కేసీఆర్ ప్రత్యేక కృషి

నంగునూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : నంగునూరు మండలం కోనాయిపల్లిలో శ్రీ వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. బ్రహ్మోత్సవాల సందర్భంగా మంగళవారం మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆలయం ఆవరణలో విలేకరులతో మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ ఇష్టదైవమైన వేంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశామన్నారు. తెలంగాణ ఉద్యమాన్ని ఈ ఆలయం నుంచే ప్రారంభించి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించామని తెలిపారు. వేంకటేశ్వరస్వామి ఆలయాభివృద్ధికి కేసీఆర్ ప్రత్యేక కృషి మేరకు రూ.3.60కోట్లతో ఆలయాన్ని అభివృద్ధి చేశామని చెప్పారు. సిద్దిపేట జిల్లాలో రూ.75 కోట్లతో వివిధ ఆలయాలను అభివృద్ధి చేశామని చెప్పారు.



నాలుగోవారం రూ.4లక్షలు

పెరిగిన బుకింగ్ ఆదాయం

● గతేడాది రూ.56.12లక్షలు, ఈసారి రూ.60.19లక్షలు

చేర్యాల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయంలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో వారం జాతరను పురస్కరించుకుని వేలాదిగా భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఈసందర్భంగా భక్తులు సమర్పించిన మొక్కుబడులు, తలనీలాలు, నిర్వహించిన ఆర్జితసేవలు, వసతిగదుల అద్దె, ప్రసాద విక్రయాలు, ప్రత్యేక దర్శనాలు, విరాళాలు, ఇతరత్రా రూపంలో శనివారం రూ.7,09,394, ఆదివారం రూ.46,21,378, సోమవారం రూ.6,89, 030 చొప్పున రూ.60,19,802 ఆదాయం సమకూరింది. గతేడాది రూ.56.12లక్షల ఆదాయం సమకూరగా, ఈసారి సుమారు రూ.4 లక్షల మేర పెరిగింది. మొదటి వారం రూ.9లక్షలు, రెండోవారం రూ.16.55లక్షలు, మూడోవారం రూ.13లక్షల ఆదాయ తగ్గినప్పటికీ నాలుగో వారం రూ.4లక్షలు పెరగడం గమనార్హం.


కొమురవెల్లిలో రెండో రోజూ

శునకాల దాడి

● బాలుడికి గాయాలు

చేర్యాల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): కొమురవెల్లిలో రెండవరోజూ కుక్కలు బీభత్సం సృష్టించాయి. ఇటీవల ముగ్గురు చిన్నారులపై కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. మంగళవారం గ్రామానికి చెందిన మరో చిన్నారి దువ్వల మహేన్షై శునకాలు దాడికి పాల్పడ్డాయి. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. రెండురోజుల్లో వరుస ఘటనలు చోటు చేసుకోవడంతో గ్రామస్థులు భయాందోళన చెందుతున్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులు చొరవ వహించి కుక్కల బెడద తీర్చాలని స్థానికులు కోరుతున్నారు.

తపాస్‌పల్లి రిజర్వాయర్‌కు గోదావరి జలాలు



తపాస్‌పల్లి రిజర్వాయర్‌లోకి ఒక పంప్ ద్వారా చేరుకుంటున్న గోదావరి జలాలు

చేర్యాల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మండలం తపాస్‌పల్లి రిజర్వాయర్‌కు గోదావరి జలాల పంపింగ్ మంగళవారం ప్రారంభించారు. గంగారం ఇన్‌టేక్‌వెల్ వద్ద గోదావరి నీటి లభ్యత ఉండడంతో దేవాదుల అధికారుల పంపింగ్ చేపట్టారు. బొమ్మకూరు రిజర్వాయర్ నుంచి తపాస్‌పల్లి రిజర్వాయర్‌కు ఒక పంప్ ద్వారా మళ్లిస్తుండడంతో వడివడిగా నీరు చేరుతుంది. కొన్నినెలలక్రితం పంపింగ్ చేపట్టి రిజర్వాయర్‌ను నింపి పలు చెరువులతో పాటు ఆలేరు నియోజకవర్గానికి మళ్లించారు. ప్రస్తుతానికి రిజర్వాయర్‌లో 535 మీటర్ల మేర నీరు నిల్వ ఉండగా, 540 మీటర్ల వరకు చేరితే రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం సంతరించుకోనుంది. ప్రస్తుతం ఒకే పంప్‌ద్వారా పంపింగ్ చేపట్టడంతో ఎన్నిరోజులపాటు కొనసాగించనున్నారన్న విషయమై స్పష్టత లేదు. 535 మీటర్ల సామర్థ్యం కొనసాగిస్తూ వచ్చిన నీటిని వచ్చినట్లుగా కుడి, ఎడమ కాలువల ద్వారా చెరువులకు మళ్లించేందుకు నిర్ణయించనున్నట్లు తెలిసింది. రిజర్వాయర్ పరిధిలోని చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట, కొండపాక తదితర మండలాల్లో కొంతమేర భూగర్భజలాల నీటిమట్టం అడుగంటిపోయింది. అప్పుడే ఎండలు మండిపోతుండటంతో సాగునీటికోసం రైతులు ఆశతో ఎదురుచూస్తున్నారు.

ఇక్కడి చెరువులకా... ఆలేరుకు తరలించేనా!

గతంలో రిజర్వాయర్‌ను ఎప్పుడు పంపింగ్ చేసినా జనగామ నియోజకవర్గంలోని చెరువులను నింపిన తరువాత పొరుగు మండలాలకు మళ్లించేవారు. కానీ మారిన రాజకీయ పరిణామాల క్రమంలో పొరుగు మండలాల తర్వాత ఇక్కడి చెరువులు నింపుతున్నారు. దీంతో ప్రతీసారి జలాల కోసం జగడం నెలకొంటున్నది. కొన్నినెలల క్రితం రిజర్వాయర్‌ను రోజుల తరబడి నింపినప్పటికీ ఈ ప్రాంతంలోని చెరువులను పూర్తిస్థాయిలో నింపకుండానే ఆలేరు నియోజకవర్గానికి తరలించుకుపోయారు. ఈ విషయమై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం వేసవి దృష్ట్యా ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు పంపింగ్ చేపట్టినప్పటికీ ఇక్కడి చెరువులు నింపుతారా... ఆలేరు తదితర నియోజకవర్గానికి మళ్లిస్తారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అదేగనక చేస్తే ఆందోళనలు కొనసాగించేందుకు బీఆర్‌ఎస్ కార్యచరణ రూపొందిస్తుంది. ఈనేపథ్యంలో ప్రభుత్వంతో పాటు దేవాదుల అధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్న విషయం ఆసక్తికరంగా మారింది.

చెరువులను నింపాలి

కొండపాక, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : దేవాదుల ఎత్తిపోతల తపాస్‌పల్లి రిజర్వాయర్ నుంచి కొండపాక మండలం మర్పడగ చెరువును నింపాలని ఆ గ్రామ రైతులు కోరారు. మంగళవారం పలువురు రైతులు కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఇంతకు ముందు కాలువల ద్వారా చెరువులను నింపారని కానీ ఈ సంవత్సరం నింపడం లేదన్నారు. ఈ ఏడాది వర్షాలు సరిగా పడనందున నీటి ఎద్దడి ఏర్పడిందని పంటలన్నీ ఎండిపోయే దశకు చేరుకున్నాయని చెప్పారు. తిమ్మారెడ్డిపల్లి కాలువ నుంచి కొండపాక, దమ్మకపల్లి, సిరసనగండ్ల గ్రామాల చెరువుల నుంచి కాలువ ద్వారా మర్పడగ చెరువును నింపాలని కోరారు. గ్రామానికి చెందిన సెల్‌బాల్ నర్సయ్యతో పాటు పలువురు రైతులున్నారు.

బీసీలకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలి

● ముదిరాజ్ సంఘం రాష్ట్ర నాయకుడు కొట్టాల యాదగిరి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ర్యాకల శేఖర్‌గౌడ్

మనోహరాబాద్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : కామారెడ్డి ఎన్నికల సమయంలో బీసీలకు రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నెరవేర్చాలని ముదిరాజ్ సంఘం రాష్ట్ర నాయకుడు కొట్టాల యాదగిరి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ర్యాకల శేఖర్‌గౌడ్ అన్నారు. మంగళవారం మనోహరాబాద్ మండలం జీడిపల్లి గ్రామంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద బీసీ కులస్తులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. గతంలో రేవంత్‌రెడ్డి కామారెడ్డి సభలో కాంగ్రెస్‌ను గెలిపిస్తే వచ్చిన ఆరునెలలకే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన సర్వే దొంగ సర్వే అని, ఇందులో బీసీల శాతం తక్కువగా చూపారన్నారు. బీసీలకు అన్యాయం చేస్తే పెద్దఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం మండల నాయకుడు దాసరి నరేష్, నాగభూషణం, పంజా భిక్షపతి, మహేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దు: సీడీపీవో

శివ్వంపేట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని సీడీపీవో హేమభార్గవి హెచ్చరించారు. మండల పరిధిలోని గోమారం, నవాబ్‌పేట్, బిజ్యాతండా, పిల్లుట్ల అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. ప్రభుత్వం అందజేస్తున్న ఆరోగ్య లక్ష్మి భోజనం నాణ్యతపై మహిళలను అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ టీచర్లు నిర్లక్ష్యం వహిస్తే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

ఈ కారు ఎవరిదో..!

- అర్ధరాత్రి గ్రామంలో చక్కర్లు
- మూడు కార్లు తిరిగినట్లు అనుమానం
- స్మగ్లర్లను ఛేజ్ చేసిన పోలీసులు?

మనూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అతిమ్యాల్ శివారులో అర్ధరాత్రి 2 గంటలు దాటిన తర్వాత కొందరు మూడు కార్లలో చక్కర్లు కొట్టడం ఆందోళనకు గురి చేసింది. ఉదయం చూడగా, గ్రామ సమీపంలో ఏపీ 39 ఎల్‌వీ 3856 నెంబరు గల కారును వదిలివెళ్లారు. విషయం పోలీసులకు సమాచారం అందించడంతో ఉదయం సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. కార్ నెంబరు ఆధారంగా ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లాకు చెందిన ముని రాజు కారుగా గుర్తించారు. అయితే, నిజామాబాద్ జిల్లాకు చెందిన పోలీసులు నిందితులు లేదా స్మగ్లర్ల కోసం కార్లను ఛేజ్ చేసినట్లు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే వారు అర్ధరాత్రి తర్వాత గ్రామ శివారులో చక్కర్లు కొట్టినట్లు భావిస్తున్నారు. పోలీసులు అర్ధరాత్రి ఒకరిని అదుపులోకి తీసుకోగా, మరో ఇద్దరు పరారీ అయినట్లు భావిస్తున్నారు. ఈ విషయమై ఎస్‌ఐ శంకరయ్యను సంప్రదించగా, విచారణ జరుపుతున్నట్లు తెలిపారు.


గ్రామశివారులో కారు

రోడ్డు ప్రమాదంలో టీచర్ మృతి

కన్నీరుమున్నీరైన విద్యార్థులు

రామాయంపేట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): తమకు పాఠశాలలు చెప్పే సార్ ఇక లేరని ఆ విద్యార్థులు కన్నీరుమున్నీర య్యారు. ఆయనను తలుచుకుని వెక్కివెక్కి ఏడ్చారు. ఈ ఘటన మండల పరిధి క్కాటి యాలలో మంగళవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. క్కాటియాల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పని చేసే హిందీ ఉపాధ్యాయుడు సయ్యద్ సలావుద్దీన్ (35) సోమవారం స్కూల్‌లో విధులు ముగించుకుని వెళ్తుండగా, మండలంలోని తొనిగుండ్ల శివారులో ఆయన ప్రయాణిస్తున్న బైక్‌ను కారు ఢీ కొట్టింది. తీవ్రంగా గాయపడిన ఆయన చనిపోయారు. మంగళవారం ఉదయం విషయం విద్యార్థులకు తెలియడంతో వారంతా పాఠశాల వద్ద సలావుద్దీన్ సార్‌ను గుర్తు చేసుకుని కన్నీరుమున్నీరయ్యారు. పాఠశాల ఆవరణలో ఫోటోతో కూడిన ఫ్లెక్సీ ఏర్పాటు చేసి సంతాపం తెలిపారు.


సలావుద్దీన్(ఫైల్)

గంజాయి కేసులో మరో నిందితుడి అరెస్ట్

నంగునూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): గంజాయి కేసులో మరో నిందితుడిని అరెస్టు చేసినట్లు సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను తెలిపారు. గంజాయి విక్రయిస్తున్న కేసులో ఇటీవల ఆరుగురిని అరెస్టు చేసి, రిమాండ్‌కు పంపారు. అదే కేసులో ఏడో నిందితుడిని మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ఆసిఫాబాద్ జిల్లా కేరమేరి మండలం అంతాపూర్ గ్రామానికి చెందిన రవిజాదవ్ అలియాస్ సందీప్ జాదవ్ మంగళవారం మధ్యాహ్నం గంజాయి విక్రయించేందుకు మండలంలోని జేపీ తండాకు వచ్చాడు. నమ్మదగిన సమాచారం మేరకు రాజగోపాలపేట ఎస్సై ఆసిఫ్ తన సిబ్బందితో వెళ్లి నిందితుడిని అరెస్ట్ చేశారు. అతని నుంచి 359 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. విచారించగా, గతంలో పట్టుపడిన గంజాయి కేసులోనూ నిందితుడిగా తేలింది.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

కొండపాక, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధకు అనారోగ్యం తోడు కావడంతో ఓ వ్యక్తి క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కుకునూరుపల్లి ఎస్‌ఐ శ్రీనివాస్ కథనం ప్రకారం.. జగిత్యాల జిల్లా పూడూరు గ్రామానికి చెందిన గట్ల శ్రీనివాస్ (52) కుటుంబం కొంత కాలంగా హైదరాబాద్‌లో ఉంటోంది. దర్జీ పని చేసే శ్రీనివాస్ అనారోగ్యానికి గురయ్యాడు. దీంతో పాటు అప్పులు పెరిగిపోయాయి. సొంత ఊరికి వెళ్లివస్తానని ఇంట్లో చెప్పి, సోమవారం బయలుదేరాడు. తిరిగి రాకపోయేసరికి కుటుంబ సభ్యులు ఫోన్ చేసినా లాభం లేకపోయింది. శ్రీనివాస్ కొండపాక మండలం వెలికట్ట క్రాస్ రోడ్ వద్ద పడి ఉన్నాడు. స్థానికులు గమనించి 108కు సమాచారం ఇవ్వగా, వారు వచ్చి సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అదే సమయంలో ఇంటి నుంచి ఫోన్ రావడంతో విషయం చెప్పారు. వారు కుమారుడు నిఖిల్ సిద్దిపేట ప్రబబత్వ ఆస్పత్రి వచ్చాడు. ఆస్పత్రిలో శ్రీనివాస్ చనిపోయాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మెడికల్ కళాశాలలో విద్యార్థుల ప్రతిజ్ఞ

మెదక్ కల్చరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్ర జ్యోతి): మెదక్ ప్రభుత్వ వైద్య కళాశాల మొదటి సంవత్సరం విద్యార్థులకు ప్రాక్టికల్స్ నిమిత్తం ముందేగా మృతదేహాన్ని తీసుకువచ్చి ప్రతిజ్ఞ చేయించి, గౌరవిస్తారు. అందులో భాగంగా మంగళవారం నిజామాబాద్ నుంచి మృతదేహాన్ని తీసుకువచ్చి మృతదేహం పట్ల గౌరవంగా ఉంటామని, తమకు విజ్ఞానాన్ని పంచేందుకు ఉపయోగపడుతున్నందున కృతజ్ఞులుగా ఉంటామని వైద్య విద్యార్థులు ప్రొఫెసర్లు మృతదేహం ముందు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలోలో ప్రిన్సిపాల్ డాక్టర్ రవీంద్రకుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రవిశంకర్, డాక్టర్ జయ, అనాటమీ విభాగం డాక్టర్ అర్చన, ఫిజియాలజీ విభాగం డాక్టర్ శాంతా కుమారి, జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త డాక్టర్ శివదయాళ్, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్, డాక్టర్ సుమంత్, తదితరులు పాల్గొన్నారు.


ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, ప్రొఫెసర్లు

పుకార్ల మోతే..!

వరుస మరణాల ఆసరాగా వివాదాలు


- ఆ చావుల వెనుక ఆర్థిక, అనారోగ్య సమస్యలు
- ఇరువర్గాల మధ్య విభేదాలతో తప్పుడు ప్రచారం
- పుకార్ల కట్టడికి నేడు గ్రామసభ

- అప్పులు తీర్చేందుకు ఆమె భర్త దుబాయ్ వెళ్లాడు. అక్కడ అనుకున్నంత పని దొరకలేదు. తిరిగివచ్చినా అప్పులు తీరే అవకాశం లేదు. ఆమె గుండెకు అప్పటికే రెండు స్టంట్లు పడ్డాయి. మనస్తాపం చెందిన ఆమె ఇంట్లోనే ఉరి వేసుకుంది. ఓ మహిళ భర్త నిత్యం మద్యం తాగుతుంటాడు. మూడేళ్ల నుంచి భర్తలో మార్పు వస్తుందని ఆశించింది. తల్లిదండ్రులకు చెప్పినా ఫలితం లేకుండా పోయింది. భర్త అలవాటు వల్ల ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయి. దీంతో ఆమె ఇంట్లోనే ఆత్మహత్య చేసుకుంది.
- ఆయనకు వృద్ధాప్యం మీదపడి లేవలేని స్థితి. కుమారుడు-కోడలు వేరుగా జీవిస్తున్నారు. ఒంటరి జీవితంతో విసిగిపోయాడు. ఏడాదిగా ఆత్మహత్య చేసుకుంటానని గ్రామంలో పలువురితో చెప్పేవాడు. చివరికి చెరువులో పడి చనిపోయాడు.

దుబ్బాక, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక కారణాలు, అనారోగ్య సమస్యలు గ్రామంలో కొందరి మరణాలకు కారణమయ్యాయి. ఇదే అదనుగా ఆ మరణాల చుట్టూ రాజకీయాలు, ఇరు వర్గాల మధ్య విబేధాలు ముసురుకున్నాయి. గ్రామంలోని రెండు ఆలయాల మధ్య కొంత కాలం నిరువుగప్పిన నిప్పులా ఉన్న విబేధాలూ పుకార్లకు మరింత ఆజ్యం పోసినట్లు స్థానికులు చెప్పుకుంటున్నారు. దుబ్బాక నియోజకవర్గంలోని అక్బర్‌పేట- భూంపల్లి మండలం మోతే గ్రామంలో సోమవారం 'వరుస మరణాల మోతే' అనే శీర్షికన ఆంధ్రజ్యోతి దినపత్రిక కథనాన్ని ప్రచురించింది. ఈ కథనం నేపథ్యంలో గ్రామంలో ఏం జరుగుతుందో తెలుసుకునేందుకు మంగళవారం 'ఆంధ్రజ్యోతి' గ్రామానికి వెళ్లింది. మంగళవారం ఆ గ్రామ పెద్దలంతా సమావేశమై పుకార్లను కట్టడి చేయాలని నిర్ణయించారు. బుధవారం అన్ని కులాల పెద్దలను, అన్ని వర్గాలతో గ్రామ సభ నిర్వహించాలని నిర్ణయించారు. పుకార్లపై 'ఆంధ్రజ్యోతి' ఆరా తీయగా.. గ్రామంలోని ఓ దేవాలయానికి పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేక మరో దేవాలయానికి చెందిన వారు, ఆ దేవాలయ ధర్మకర్తల వెనుక పార్టీలు ఉండటంతో వరుస మరణాలకు దేవాలయంలో జరుగుతున్న కారణాలే కారణమనే పుకార్లు షికార్లు చేస్తున్నట్లు చెప్పారు.

అసలేం జరుగుతోంది..

మోతే గ్రామంలో రెండు ఆలయాల్లో ధూపదీపాలకు నోచుకోక దీనస్థితికి చేరాయి. ఈ నేపథ్యంలో గ్రామానికి చెందిన కొందరు గ్రామానికి చెందిన ఒకరిని ఆశ్రయించి, నిత్యపూజలు చేయాలని కోరారు. ఆయన సున్నితంగా తిరస్కరించడంతో జిల్లా కేంద్రంలో ఉంటున్న అదే గ్రామానికి చెందిన ఒకరికి బాధ్యతలు అప్పగించారు. జిల్లా కేంద్రంలో ఆయన వాస్తు, జ్యోతిష్యంతోపాటు శాంతిపూజలు కూడా చేస్తారని నమ్మకంతో భక్తులు ఎక్కువగా వచ్చేవారు. దోషాలు కూడా తొలగిస్తారనే నమ్మకంతో ఈ ప్రాంతం నుంచే కాకుండా సినిమా పరిశ్రమకు చెందిన వారు కూడా ఆయన వద్దకు వచ్చి ముహూర్తాలు పెట్టించుకుంటుంటారు. ఆయనే గ్రామంలోని ఓ ఆలయానికి పూజారి కావడంతో సదరు ఆలయానికి భక్తుల సంఖ్య పెరిగింది. ఆలయానికి ప్రాచుర్యమూ పెరిగింది. నిత్యం హోమాలు, వైదిక కార్యక్రమాలతో రద్దీగా మారింది. అయితే, తనకు వతన్‌గా ఉన్న గ్రామంలో మరొకరి పెత్తనం సహించలేని మరో ఆలయ పూజారి.. ఆ ఆలయంలో క్షుద్రపూజలు జరుగుతున్నాయని ప్రచారం మొదలు పెట్టాడు. అందువల్లే గ్రామంలో వరుసగా అనారోగ్యాలు, ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్నాయని ప్రజల్లో భయాందోళనలు రేకెత్తించే ప్రయత్నం చేశాడు. అంతే కాకుండా గ్రామంలో దేవాలయ భూములను ఆక్రమించిన వారిని లక్ష్యంగా చేసుకుని కూడా పుకార్లు పుట్టిస్తున్నట్లు గ్రామ పెద్దలు చెప్పారు. పుకార్లతో గ్రామంలో భయాందోళనలు చెందుతున్నారన్నారు.


మోతే గ్రామం

అవగాహన కల్పించాలి

గ్రామంలో పుకార్లు, మూఢ విశ్వాసాలతో భయాందోళనలు నెలకొన్న నేపథ్యంలో ప్రజల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని అంటున్నారు. బుధవారం జరిగే గ్రామసభలో పోలీసులు, అధికారులు ప్రధాన పాత్ర పోషించి మూఢవిశ్వాసాలపై అవగాహన కల్పించాలని కోరుతున్నారు.

మెదక్‌లో వ్యాపారి బలవన్మరణం

ఆర్థిక ఇబ్బందులే కారణం

మెదక్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ కిరాణా వ్యాపారి సాయిదీప్ రమేష్(54) మంగళవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. జిల్లా కేంద్రంతో పాటు పలు మండలాలకు సుపరిచితుడైన ఆయన వ్యాపార రంగంలో మంచి పేరు సంపాదించారు. ఆకస్మాత్తుగా ఆయన ఆత్మహత్య చేసుకోవడం వెనుక ఆర్థిక ఇబ్బందులే కారణమని చెబుతున్నారు. మెదక్‌లో చిన్న కిరాణాషాపుతో తన వ్యాపారాన్ని ప్రారంభించిన రమేష్ అనతికాలంలోనే ఇక్కడి ప్రజలకు సూపర్ మార్కెట్‌ను పరిచయం చేశారు. మెదక్ ప్రాంతంలో పెళ్లి, విందు, ఏ చిన్న కార్యం జరిగినా నిత్యావసర సామగ్రి కొనుగోలు చేసేందుకు సాయిదీప్ సూపర్‌మార్కెట్‌కు వెళ్లాల్సిందే అన్నట్లుగా ఈ రంగంలో పేరు సంపాదించారు. అంతగా ఆయన వ్యాపారం ఎదగడానికి ఆయన వ్యవహార శైలి ప్రధాన కారణంగా చెబుతారు. కస్టమర్లను ఆప్యాయంగా పలకరించడంతో పాటు.. దగ్గరుండి సామగ్రిని మోటర్‌సైకిల్‌పై పెట్టే రమేష్ అంటే అందరికీ అభిమానం.

వెంటాడిన ఆర్థిక సమస్యలు?

సాయిదీప్ ఆత్మహత్యకు ఆర్థిక సమస్యలే కారణమని చెబుతున్నారు. వ్యాపారంలో పోటీ పడేందుకు తక్కువ లాభాలకే వ్యాపారం చేసేవాడని, వ్యాపారానికి సొంత భవనం సమకూర్చుకునే క్రమంలో అప్పులు అయ్యాయని అంటున్నారు. వ్యాపారం బాగానే సాగిన అప్పులు ఎక్కువ కావడంతో ఆత్మహత్య చేసుకున్నట్లు భావిస్తున్నారు.


రమేష్ భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్

పరామర్శించిన ఎమ్మెల్యే

సాయిదీప్ రమేష్ భౌతిక కాయాన్ని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ సందర్శించి, ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. మంచి వ్యాపారవేత్తగా పేరు సంపాదించిన ఆయన మరణం తీరని లోటని ఎమ్మెల్యే అన్నారు. ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డిలు భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.


ప్రయోగాలు చేసి చూపిస్తున్న ఉపాధ్యాయుడు చిన్న బ్రహ్మయ్య

ఎస్‌సీఈఆర్‌టీకి దామరకుంట టీచర్ ప్రదర్శన

మర్కుక్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎస్‌సీఈఆర్‌టీ) ఏటా నిర్వహించే ఉపాధ్యాయుల సైన్స్ సెమినార్ పోటీలకు మండలంలోని దామరకుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడి ప్రదర్శన ఎంపికైంది. పాఠశాల భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు వై. చిన్నబ్రహ్మయ్య రూపొందించిన 'పాఠశాల- ఒక వింత అభ్యాసాల వేదిక అనే అంశం రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపికైనట్లు మండల విద్యాధికారి వెంకట్ రాములు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 165 ప్రాజెక్టులు పోటీ పడగా, వై. చిన్న బ్రహ్మయ్య రూపొందించిన ప్రాజెక్ట్ ఎంపికైందని తెలిపారు. జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి, పీఆర్‌టీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్‌రాఘుకుమార్, దామరకుంట పాఠశాల ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు అభినందించారు.

ఏడుపాయలలో పకడ్బందీగా ఏర్పాట్లు

పరిశీలించిన మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

పాపన్నపేట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ఏడుపాయాల జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా, పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి ఆదేశించారు. జాతర నేపథ్యంలో మంగళవారం ఆయన ఏడుపాయల ఆలయం వద్ద పరిసరాలు, పార్కింగ్ స్థలాలను పరిశీలించారు. సామాన్య భక్తులకు ఇబ్బందులు లేకుండా క్యూలు ఏర్పాటు చేయాలన్నారు. రద్దీకి అనుగుణంగా అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ట్రాఫిక్‌జామ్ లేకుండా వాహనాలకు పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేయాలన్నారు. అధికారులు క్షేత్ర స్థాయిలో ఎప్పటికపుడు ఏర్పాట్లను పరిశీలించాలన్నారు. ఆయన వెంట డీఎస్పీ ప్రసన్నకుమార్, సీఐ రాజశేఖర్ రెడ్డి, ఎస్సై శ్రీనివాస్ గౌడ్, తదితరులున్నారు.


ఏడుపాయలలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

లింగ సమానత్వంపై జాతీయ సదస్సు

కంది, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): దేశంలో లింగ గతిశీలతను విమర్శనాత్మకంగా విశ్లేషించేందుకు, లింగ సమానత్వంపై సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీ హెచ్‌లో మంగళవారం జాతీయ సదస్సును నిర్వహించారు. వికసిత్ భారత్-2047 ప్రాజెక్ట్ కోసం ఆత్మనిర్భర్ బేటీయన్‌లో భాగంగా దేశంలో బాలికల సాధికారతలో బేటీ బచావో బేటీ పడావో పాత్రను అన్వేషించే దిశగా ఐఐటీ హైదరాబాద్, ఐఐటీ గౌహతి, ఐఐటీ ఢిల్లీ, పశ్చిమ బెంగాల్ వర్సిటీ పరిశోధకులు పరిశోధనలు చేస్తున్నారు. ఇందుకు ఐఐటీహెచ్‌లోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ లిబరల్ ఆర్ట్ విభాగం షరతులతో కూడిన నిధులను అందజేస్తోంది. ఈ నేపథ్యంలో బాల్యవివాహాలను తగ్గించడం, భ్రూణహత్యలు, బాలికల సామాజిక-ఆర్థిక భవిష్యత్ సమస్యలు పరిష్కరించడం వంటి అంశాలను ఈ సదస్సులో చర్చించారు. సదస్సులో ఐఐటీహెచ్ డైరెక్టర్ బీఎస్ మూర్తి మాట్లాడుతూ ఐఐటీ హైదరాబాద్‌లో విద్యావిషయక పరిజ్ఞానాన్ని పెంపొందించడమే కాకుండా సమాజంలో అర్థవంతమైన మార్పును అందించే పరిశోధనలను ప్రోత్సహించేందుకు కృషి చేస్తుందని తెలిపారు. దేశంలో లింగ సమానత్వం, బాలికల సాధికారతకు కట్టుబడి ఉన్నామని ఐఐటీహెచ్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ లిబరల్ ఆర్ట్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అనిందితా మజుందార్ వెల్లడించారు.


సదస్సులో పాల్గొన్న వివిధ రాష్ట్రాల ప్రతినిధులు



ఈ జైలు.. ఇక చరిత్రే..!

కనుమరుగు కానున్న 229 ఏళ్ల నాటి సంగారెడ్డి జైలు.. శిథిలావస్థకు భవనం

అప్పట్లోనే అనేక సంస్కరణలు- 2016లో హెరిటేజ్ జైలు మ్యూజియంగా ఏర్పాటు

ఆదరణ లేక మూతపడిన 'ఆయుర్వేదిక్ విలేజ్'

సినిమాలు, షార్ట్ ఫిలిమ్స్, ఆల్బమ్స్ చిత్రీకరణకు వేదిక- ఆధునికీకరిస్తే ప్రయోజనం

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): వారసత్వ సంపద కారాగార ప్రదర్శనశాల శిథిలావస్థకు చేరుకుంటుంది. జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలోని 229 ఏళ్ల చరిత్ర ఉన్న హెరిటేజ్ జైలు మ్యూజియం క్రమ క్రమంగా కూల్చివేతలకు గురై నిరుపయోగంగా మారింది. 1796లో ఉమ్మడి మెదక్ జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలో జిల్లా జైలును నిర్మించారు. ఆ తర్వాత కంది శివారులో జిల్లా జైలుకు నూతన భవనం నిర్మించడంతో 2012 ఏడాదిలో దీనిని అక్కడికి తరలించారు. ఈ నేపథ్యంలో పాత జిల్లా జైలును 2016 జూన్ 5న హెరిటేజ్ జైలు మ్యూజియంగా మార్చారు.

ఫీల్ ది జైల్‌కు వేదిక..

జైళ్ల శాఖ డీజీగా వీ.కే.సింగ్ ఉన్న క్రమంలో 'మై నేషన్ ఫిల్లింగ్ స్టేషన్' పేరిట పెట్రోల్ బంకులు నెలకొల్పి, ఖైదీల శిక్షా కాలం పూర్తయిన తర్వాత వారు సమాజంలో గౌరవంగా బతకాలనే ఉద్దేశంతో అవే పెట్రోల్ బంకుల్లో ఉపాధి కల్పించారు. ఖైదీల చేత వివిధ రకాల ఉత్పత్తులు, దుస్తులు, ఫర్నీచర్ తయారు చేయించి ప్రజలకు అందుబాటులో ఉంచి అమ్మకాలు చేపట్టి, జైళ్ల శాఖకు ఆదాయం సమకూరేలా చర్యలు తీసుకున్నారు. ఇదే క్రమంలో 2016 జూన్ 5 న సంగారెడ్డిలోని పాత జిల్లా జైలును హెరిటేజ్ జైలు మ్యూజియాన్ని తీర్చిదిద్దారు. ఏళ్ల నాటి చరిత్ర కలిగిన ఈ జైలు మ్యూజియంలో పురాతన శిక్షలకు సంబంధించిన ఆనవాళ్లు, కఠిన శిక్షల గురించిన చిత్రాలను అమర్చారు. పాత తరం జైళ్లలో వినియోగించిన పరికరాలు, ఖైదీలు వినియోగించే వస్తువులను ప్రదర్శనకు పెట్టారు. మసాజ్ కోసం కేరళ ఆయుర్వేదిక్ విలేజ్‌ను కూడా ఏర్పాటు చేశారు. ముఖ్యంగా జైలు జీవితం గడపాలనుకునే వారు (ఫీల్ ది జైల్)పేరిట రూ.500 చెల్లిస్తే ఒక రోజంతా అచ్చం ఖైదీ మాదిరిగా కారాగారంలో గడిపే అవకాశం ఈ మ్యూజియంలో కల్పించారు. ఎంతో మంది ప్రముఖులు, వివిధ రాష్ట్రాలు, ప్రాంతాల నుంచి ఇక్కడికి వచ్చి ఒక రోజు జైలులో ఉండే అనుభూతిని పొంది వెళ్లారు. సినిమాల్లో కనిపించే పలు ఫైటింగ్ సీన్స్, రెయిన్ సీన్స్, జైలులో ఖైదీల అవతారం ఇలా పలు రకాల సన్నివేశాలను ఇదే జైలు మ్యూజియంలో చిత్రీకరించారు. సెట్టింగ్‌లకు ఖర్చు కలిసొస్తుందనే ఉద్దేశంలో సినిమాలు, షార్ట్ ఫిలిమ్స్, ఆల్బమ్స్ చిత్రీకరణకు ఈ మ్యూజియం అప్పట్లో వేదికగా మారిందని చెప్పవచ్చు.

శిథిలావస్థకు..

సంగారెడ్డి పట్టణంలోని హెరిటేజ్ జైలు మ్యూజియం సుమారు నాలుగున్నర ఎకరాల్లో ఉంది. మ్యూజియం వెనకాల జైళ్ల శాఖకు చెందిన కొంత స్థలంలో ప్రస్తుతం ఆ శాఖ ఆధ్వర్యంలో 2019 నుంచి బీపీసీఎల్ పెట్రోల్ బంక్ కొనసాగిస్తున్నారు. ఇదే మ్యూజియం భవనంలో ప్రస్తుతం ఉమ్మడి జిల్లా సబ్‌జైళ్ల అధికారి(డీఎస్‌జేవో) కార్యాలయం కొంత కాలంగా ఉంది. అయితే ఈ మ్యూజియం ఒక పక్క నుంచి కూలిపోతూ శిథిలావస్థకు చేరుతుండడంతో ఆ కార్యాలయంలో పనిచేసే సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. 2020 ఏడాదిలో 'ఫీల్ ది జైలు' బ్యారక్ వర్షానికి కూలిపోయింది. అంతకుముందు ఆదరణ లేక పోవడంతో మై నేషన్ కేరళ ఆయుర్వేదిక్ విలేజ్ పేరిట ఏర్పాటు చేసిన మసాజ్ కేంద్రం కూడా ఈ మ్యూజియంలో మూతపడింది. ఇంతలో కరోనా కాలం రావడంతో షూటింగ్‌లు కూడా నిలిచిపోయాయి. అప్పటి నుంచి ఏటా వర్షాలకు క్రమంగా మ్యూజియం కూల్చివేతలకు గురై శిథిలావస్థకు చేరి ప్రస్తుతం నిరుపయోగంగా మారింది. కాగా, ఇందులోని సామగ్రిని కూడా ఇప్పటికే కందిలోని సెంట్రల్ జైలుకు తరలించారు. ఇప్పటికైన ప్రభుత్వం నిరుపయోగంగా మారిన ఈ వారసత్వ సంపద కారాగార ప్రదర్శనశాలను(హెరిటేజ్ జైలు మ్యూజియం) అభివృద్ధి చేయడం లేదా ఆధునీకరించి ఇతర అవసరాలకు వినియోగిస్తే ప్రయోజనకరంగా ఉంటుందని స్థానిక ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

క్రైం కార్నర్

8 మందికి జరిమానా

సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట పట్టణంలో ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో కొన్ని రోజుల క్రితం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఇందులో 8 మంది మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని మంగళవారం సిద్దిపేట స్పెషల్ సెకండ్ క్లాస్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కాంతారావు ముందు హాజరుపరచగా విచారణ చేసి 8 మందికి రూ.15,000 జరిమానా విధించారు.

మహిళకు రూ.50 వేలు..

అక్కన్నపేట, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించిన ఘటనలో మహిళకు జరిమానా విధించారు. ఎక్సైజ్ సీఐ పవన్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అక్కన్నపేట మండలం కుందనవానిపల్లి గ్రామానికి చెందిన బానోతు సుగుణ గతంలో గుడుంబా విక్రయిస్తూ పట్టుబడడంతో తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు. తాజాగా మరోసారి పట్టుబడడంతో మంగళవారం తహసీల్దార్ ముందు హాజరుపరచగా రూ.50 వేలు జరిమానా విధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్ఐలు శెట్టి దామోదర్, రూప, హెడ్ కానిస్టేబుల్ మల్లారెడ్డి తదితరులు ఉన్నారు.

ఇసుక డంపు పట్టివేత



బెజ్జంకి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంపును పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ కృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గాగిల్లాపూర్ గ్రామ శివారులో ఇసుకను అక్రమంగా తరలించి డంపు చేస్తున్నారని సమాచారం అందుకున్న టాస్క్ ఫోర్స్, బెజ్జంకి పోలీసులు అక్కడికి వెళ్లి సుమారు 40 టన్నుల ఇసుక, జేసీబీని స్వాధీనం చేసుకున్నారు. జేసీబీ ఓనర్, డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మెరుగైన వైద్య సేవలందించాలి

● డీఎంఅండ్‌హెచ్‌వో పాల్వన్‌కుమార్



రాయపోల్ పీహెచ్‌సీలో డీఎంఅండ్‌హెచ్‌వో పాల్వన్‌కుమార్

రాయపోల్ / గజ్వేల్ రూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పాల్వన్‌కుమార్ సిబ్బందికి సూచించారు. మంగళవారం ఆయన డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ శ్రీనివాస్‌తో కలిసి రాయపోల్, అహ్మదీపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి ఆరోగ్య కార్యక్రమాల పనితీరును తెలుసుకున్నారు. ల్యాబ్‌లో నిర్వహిస్తున్న పరీక్ష నమూనాలు, ఫార్మసీలో మందులు పరిశీలించారు. అనంతరం రోగుల వద్దకు వెళ్లి పీహెచ్‌సీలో అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ప్రతి డిపార్ట్‌మెంట్‌లో రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలన్నారు. ప్రసవాల సంఖ్య పెంచే విధంగా ప్రణాళికలు చేసుకోవాలన్నారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటించి రోగులకు నిత్యం అందుబాటులో ఉంటూ ఇబ్బంది కలుగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి మహారాజ్ బల్లా, సీహెచ్‌వో రవీందర్‌రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేయాలి

బెజ్జంకి, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా కృషి చేయాలని సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను సూచించారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఆయన సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సీసీ కెమెరాల ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. బెజ్జంకి మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంచుకొని నెల రోజుల్లో అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామాల్లో గంజాయి, ఇతర మత్తుపదార్థాలు, అక్రమ వ్యాపారాలపై నిఘా ఉంచాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ కృష్ణారెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికలకు సహకరించాలి



గ్రామస్థులకు సూచనలు చేస్తున్న చేర్యాల సీఐ శ్రీను

మద్దూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : రాబోయే గ్రామపంచాయతీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రజలు సహకరించాలని చేర్యాల సీఐ ఎల్.శ్రీను సూచించారు. మంగళవారం మండలంలోని మర్మాముల గ్రామంలో నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. అనవసరమైన గొడవలు సృష్టించి క్రిమినల్ కేసులపాలు కావొద్దన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

చేర్యాల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని చేర్యాల ఎస్ఐ నీరేశ్, కొమురవెల్లి ఎస్ఐ రాజు అన్నారు. చేర్యాల మండలం ఆకునూరు, కొమురవెల్లి మండలం ఐనాపూర్, శబాష్‌గూడెం తదితర గ్రామాల్లో మంగళవారం సాయంత్రం వేర్వేరుగా ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహించారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపికైన విద్యార్థులు



ఎంపికైన కోహెడ పాఠశాల విద్యార్థులు

ధూళిమిట్ట / కోహెడ, ఫిబ్రవరి11 (ఆంధ్రజ్యోతి): ఎన్‌ఎంఎంఎస్ (నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్)కు మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థులు కొలిపాక సంజన, ఎర్ర శృతి, కొండూరి ప్రణయ్‌కుమార్ ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎనుముల కరుణాకర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరికి 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు సంవత్సరానికి రూ.12 వేల చొప్పున స్కాలర్‌షిప్ అందుతుందన్నారు. ఎంపికైన విద్యార్థులను, అందుకు కృషి చేసిన ఉపాధ్యాయులను ఆయన అభినందించారు. అలాగే కోహెడ ఉన్నత పాఠశాలకు చెందిన బొడిగె దీక్షిత, జాలిగం వేదాక్షరి, గడ్డం శ్రీశాంక, సగిర తాబస్సుం ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎండీ మహమద్ తెలిపారు.

చిలుకూరి బాలాజీ ఆలయ అర్చకుడికి పరామర్శ

గజ్వేల్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): చిలుకూరి బాలాజీ ఆలయ అర్చకుడు రంగరాజన్‌పై దాడి జరిగిన నేపథ్యంలో గజ్వేల్ బ్రాహ్మణ సంఘం నాయకులు మంగళవారం ఆయనను పరామర్శించారు. దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సంఘం అధ్యక్షుడు దేశపతి శంకరశర్మ, కార్యదర్శి రవిందర్‌రావు, కోశాధికారి విఠాల కృష్ణమూర్తి శర్మ, చాడ నందబాల శర్మ, యువ వాహిని అధ్యక్షుడు సాయికృష్ణశర్మ, కార్యదర్శి నందగిరి శ్యాంప్రసాద్‌శర్మ, కోశాధికారి రఘు మురళీమోహన్ శర్మ, విశ్వేశ్వర్‌రావు తదితరులు పరామర్శించినవారిలో ఉన్నారు.



మానసిక దివ్యాంగులను చేరదీయాలి

● జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ స్వాతిరెడ్డి



మనోచేతన సంస్థలోని మానసిక దివ్యాంగులతో స్వాతిరెడ్డి

చేర్యాల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : మానసిక దివ్యాంగులను చేరదీసి చేయూతనివ్వాలని సిద్దిపేట జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ స్వాతిరెడ్డి అన్నారు. చేర్యాల పట్టణంలోని మనోచేతన మానసిక వికలాంగుల పునరావాస కేంద్రాన్ని మంగళవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా దివ్యాంగుల హాస్టల్, భోజన వసతి, నాణ్యత, వంటగది పరిసరాలు, ఆహార పదార్థాల నిల్వను పరిశీలించారు. మనోచేతన సంస్థ అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం స్వాతిరెడ్డి మాట్లాడుతూ మనోచేతన సంస్థలకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ సహకారం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో మనోచేతన నిర్వహకురాలు కె.రమాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

వంద శాతం ఆస్తి పన్ను వసూలు చేయాలి

● హుస్నాబాద్ మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్ అబ్దుల్ హమీద్



సమావేశంలో మాట్లాడుతున్న స్పెషల్ ఆఫీసర్ అబ్దుల్ హమీద్

హుస్నాబాద్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్‌లో వంద శాతం ఆస్తి పన్ను వసూలు చేయాలని ఇన్‌చార్జి అడిషనల్ కలెక్టర్, మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్ అబ్దుల్ హమీద్ అధికారులకు సూచించారు. మంగళవారం ఆయన హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. శానిటేషన్, వాటర్ సప్లయ్‌పై ప్రత్యేకంగా దృష్టి సారించాలని ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నక్ష కార్యక్రమానికి హుస్నాబాద్ మున్సిపాలిటీని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారని, పట్టణ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. సమావేశంలో కమిషనర్ మల్లికార్జున్, మేనేజర్ భూమానందం, ఏఈ మహేశ్ తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పన్నులు చెల్లించి ప్రగతికి సహకరించండి

● గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ నర్సయ్య



గజ్వేల్ పట్టణంలో పన్ను వసూలును పరిశీలిస్తున్న కమిషనర్ నర్సయ్య

గజ్వేల్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): పన్నులు చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య పిలుపునిచ్చారు. గజ్వేల్ పట్టణంలో పేరుకుపోయిన ఆస్తి పన్ను బకాయి దారుల వద్దకు స్వయంగా వెళ్లి పన్నులను వసూలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆస్తి, కుళాయి పన్నులను చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని కమిషనర్ కోరారు. ఈ సందర్భంగా పట్టణంలో పారిశుధ్య చర్యలను, యూజీడీ పనులను పరిశీలించారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవిందర్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన



ఇంటి నిర్మాణానికి ముగ్గు పోస్తున్న అధికారులు

మద్దూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో ఇందిరమ్మ నమూనా ఇంటి నిర్మాణానికి మంగళవారం హౌజింగ్‌శాఖ ఆధ్వర్యంలో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సిద్దిపేట హౌజింగ్ డీఈ ఎ.శంకర్ మాట్లాడుతూ తహసిల్దార్ అందించిన రిపోర్టు ఆధారంగా తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల మధ్య ఇందిరమ్మ గృహాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. 46 గజాల్లో కిచెన్, హాల్, బెడ్‌రూంతోపాటు బాత్‌రూం నిర్మిస్తామన్నారు. ఈ మాడల్ హౌజ్ మాదిరిగా లబ్ధిదారులు నిర్మాణం చేపట్టుకోవాలని సూచించారు. స్థల లభ్యత ఉంటే ఇంటి నిర్మాణ విస్తీర్ణాన్ని పెంచుకోవచ్చన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రహీం, ఆర్ఐ రమేష్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

'పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి'

చేర్యాల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : గ్రామ సమస్యలు పట్టించుకోకుండా అవినీతికి పాల్పడుతున్న ఐనాపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి బాలరాజుపై చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కొమురవెల్లి ఎంపీడీవో కార్యాలయం ఎదుట బైఠాయించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి తాడూరి రవీందర్ మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శి ఇంటి నిర్మాణ అనుమతులు, పన్నుల వసూలులో అవినీతికి పాల్పడుతున్నారని, పింఛన్ల పంపిణీలో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారన్నారు. ఈ విషయమై సమగ్ర విచారణ జరపాలని, లేనియెడల ఆందోళనలు కొనసాగిస్తామన్నారు. అనంతరం ఎంపీడీవో వర్మకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో రాజు, యాదగిరి, ఇస్తారి, శంకర్, నవీన్, రవి, పోశయ్య, అనిల్, బాలనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మృత్యుంజయ యాగంలో పాల్గొన్న భక్తులు

మృత్యుంజయ హోమం

సిద్దిపేట కల్చరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : సిద్దిపేట జిల్లా కేంద్రంలోని మార్కండేయ దేవాలయం వార్షికోత్సవాలు ఘనంగా జరిగాయి. మంగళవారం శివపార్వతుల కల్యాణం, మృత్యుంజయ యాగం, పల్లకి సేవ నిర్వహించారు.

భూ సమస్యలను పరిష్కరించాలి

నంగునూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ అధికారులకు సూచించారు. మంగళవారం నంగునూరు తహసీల్దారు కార్యాలయాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేసి మాట్లాడారు పెండింగ్ సమస్యలు లేకుండా ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు. తహసీల్దార్ జి.సరిత, సీనియర్ అసిస్టెంట్ ప్రవీణ్‌కుమార్, గిర్దావర్‌లు లింగం, జయసూర్య పాల్గొన్నారు.

ప్రారంభానికి నోచుకోని జీపీ భవనం

● అన్ని హంగులతో నిర్మాణం ● పనులు పూర్తయినా తీవ్ర జాప్యం



బండతిమ్మాపూర్ గ్రామ పంచాయతీ నూతన భవనం

ములుగు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): అన్ని హంగులతో గ్రామపంచాయతీ భవనం నిర్మించుకున్నప్పటికీ ప్రారంభోత్సవానికి నోచుకోవడంలేదు. ఇది ములుగు మండలం బండతిమ్మాపూర్ గ్రామ పంచాయతీ భవనం దుస్థితి. గత ప్రభుత్వం పలు గ్రామపంచాయతీల భవనాల నిర్మాణానికి నిధులు కేటాయించింది. ఇందులో భాగంగా బండతిమ్మాపూర్ జీపీ భవనానికి ఎంఎన్‌ఆర్ఈజీఎస్ పథకం కింద ప్రభుత్వం రూ.20 లక్షలు కేటాయించగా, గ్రామ పరిధిలోని కోకాకోలా కంపెనీ రూ.26 లక్షలు వెచ్చించింది. ఈ నిధులతో గ్రామపంచాయతీ భవనాన్ని అధునాతన సౌకర్యాలతో నిర్మించారు. వందశాతం పనులు పూర్తయినా ప్రారంభంలో తీవ్ర జాప్యం జరుగుతున్నది. గత ప్రభుత్వం హయాంలో నిర్మాణం జరగడం, అంతలోనే ప్రభుత్వం మారడంతో ప్రారంభోత్సవం పెండింగ్‌లో పడింది. ఇప్పటికైనా ఈ భవనం ప్రారంభానికి పాలకులు, అధికారులు చొరవ చూపాలని గ్రామస్థులు కోరుతున్నారు.

వివాహానికి ఆర్థిక సాయం

మద్దూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : నిరుపేద కుటుంబానికి చెందిన ఆడబిడ్డ వివాహానికి ఎన్‌ఆర్ఐ నిశికాంత్‌రెడ్డి ఆర్థికసాయం అందించారు. మండలంలోని మర్మాముల గ్రామానికి చెందిన జాజాల ఎల్లమ్మ, సాయిబాబా దంపతుల పెద్ద కూతురు కళ్యాణి వివాహానికి ఆయన రూ.25 వేలు అందించి ఉదారత చాటుకున్నారు.

విద్యార్థులకు స్టీల్‌ప్లేట్లు పంపిణీ

చేర్యాల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల మండలం పోతిరెడ్డిపల్లికి చెందిన చిగుళ్లపల్లి మల్లికార్జున్ మంగళవారం గ్రామంలోని ఎంపీపీఎస్ పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజన నిమిత్తం స్టీల్‌ప్లేట్లను విరాళంగా అందించారు.

కాంగ్రెస్ మండల అధ్యక్షురాలిగా భార్గవి

చేర్యాల, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి) : మహిళా కాంగ్రెస్ కొమురవెల్లి మండల అధ్యక్షురాలిగా బుడిగె భార్గవి నియామకమయ్యారు. ఈ మేరకు మంగళవారం గ్రామంలో ఏర్పాటుచేసిన కార్యకర్తల సమావేశంలో సిద్దిపేట జిల్లా ఇన్‌చార్జి అపర్ణ, అధ్యక్షురాలు ముద్దం లక్ష్మి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు రేష్మ, సుమలత ఆమెకు నియామకపత్రం అందజేశారు.

'సంతకాలు ఫోర్జరీ చేసిన అధికారిని సస్పెండ్ చేయాలి'

హుస్నాబాద్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : ఏఈవోల సంతకాలను ఫోర్జరీ చేసిన వ్యవసాయ అధికారిని సస్పెండ్ చేయాలని సీపీఎం జిల్లా నాయకుడు శివరాజ్ కోరారు. మంగళవారం ఆయన హుస్నాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు. దళారులతో కుమ్మక్కై వ్యాపారుల పేరు మీద సీసీఐకి పత్తి ధ్రువీకరణ పత్రాలు రాసి ఇచ్చిన ఏవోను విధుల నుంచి తొలగించాలన్నారు. దాదాపు 300 ఎకరాలకు సంబంధించి ఏఈవోల సంతకాలను ఫోర్జరీ చేశాడన్నారు.



ఘనంగా ఎల్లమ్మ కల్యాణం

రాయపోల్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామారం గ్రామంలో ఎల్లమ్మ, జమదగ్నిల కల్యాణాన్ని మంగళవారం గౌడ సంఘం ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి మహిళలు ఒడిబియ్యం పోసి ముడుపులు సమర్పించుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై కల్యాణాన్ని తిలకించారు. కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు సుధాకర్, సీనియర్ నాయకులు కనకయ్య, కిష్టారెడ్డి, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి కాముని గోపాల స్వామి

సిద్దిపేటరూరల్, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : హమాలీ కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కాముని గోపాలస్వామి అన్నారు. మంగళవారం సిద్దిపేట రూరల్ మండలం బుస్సాపూర్ గ్రామంలో హమాలీ కార్మిక సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మన్నె మల్లేశం, ప్రధాన కార్యదర్శిగా మద్దూరి శ్రీనివాస్, కోశాధికారి బోళ్ల ఎల్లం, ఉపాధ్యక్షులు మద్దూరి రాములు, సహాయ కార్యదర్శి మన్నె గిరి, కార్యవర్గ సభ్యులు చంద్రారెడ్డి, చంద్రయ్య, మహేష్, నరేష్, రామాంజి, కనకయ్య, బాలరాజు, ప్రశాంత్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో హమాలీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మామిడాల కనకయ్య, గౌరవ అధ్యక్షుడు యాదగిరి పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలి : బీఆర్ఎస్

మద్దూరు, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా బీఆర్ఎస్ కార్యకర్తలు కృషి చేయాలని క్లస్టర్ ఇన్‌చార్జి ముత్యాల బాలనర్సయ్య, పార్టీ మద్దూరు మండల అధ్యక్షుడు మేక సంతోష్ సూచించారు. మంగళవారం రేబర్తి గ్రామంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. బీఆర్ఎస్ హయంలో జరిగిన అభివృద్ధి పనుల్ని ప్రజలకు వివరిస్తూనే, కాంగ్రెస్ మోసపూరిత వాగ్దాలను ఎండగడుతూ ముందుకెళ్లాలన్నారు. నాయకులు శివగారి అంజయ్య, పచ్చిమట్ల మానస, మంచాల కొండయ్య, గ్రామశాఖ అధ్యక్షులు లింగారెడ్డి, మండల నాయకులు బాల్‌రెడ్డి, యాదయ్య, శ్రీనివాస్, భూపతిరెడ్డి, చంద్రమౌళి, గణేష్ పాల్గొన్నారు.

విని'యోగం'లేదా?

(5వ పేజీ తరువాయి)

చేసేందుకు ముందుండాల్సిన పలు స్వచ్ఛంద సేవాసంస్థలు వృద్ధాశ్రమాన్ని నిర్వహణకు ముందుకు రావడంలేదు. ఈ విషయమై అధికారులను వివరణ కోరగా వృద్ధాశ్రమాన్ని లార్డ్ అనే స్వచ్ఛంద సేవా సంస్థతో ఒప్పందం కుదుర్చుకుని అప్పగించామని, అకౌంటు ఓపెన్ చేయడంలో స్వచ్ఛంద సంస్థకు చెందిన వ్యక్తి కొంత జాప్యం చేస్తున్నారని తెలిపారు. త్వరలోనే సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. మహిళా ప్రాంగణాన్ని కూడా స్వచ్ఛంద సంస్థకు అప్పగించి అమల్లోకి తీసుకువచ్చేలా కృషి చేస్తామని చెబుతున్నారు.

శిథిలావస్థకు చేరాక అందుబాటులోకి తెస్తారా?



వృద్ధులకు అండగా నిలవాలని, మహిళలు ఆర్థికంగా రాణించాలన్న సంకల్పంతో ఏర్పాటు చేసిన భవనాలను అందుబాటులోకి తీసుకురాకుండా కాలక్షేపం చేయడం సరికాదు. భవనాలను అందుబాటులోకి తీసుకొచ్చి వృద్ధులకు, మహిళలకు న్యాయం చేయాలి. భవనాలు వినియోగంలోకి రాకపోతే అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయి. అధికారులు జోక్యం చేసుకుని భవనాలను అందుబాటులోకి తీసుకురావాలి.

- రమేశ్, తాజా మాజీ సర్పంచ్, ఎల్లుపల్లి

నేషనల్ హైవే నిర్మాణ పనులకు సర్వే



రైతులతో మాట్లాడుతున్న అధికారులు

కొండపాక, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి) : నేషనల్ హైవే నిర్మాణ పనుల కోసం కొండపాక మండలం వెలికట్ట, దుద్దెడ, జప్తి నాచారం శివారు ప్రాంతాల్లో మంగళవారం అధికారులు సర్వే చేశారు. వెలికట్ట శివారులో రింగు రోడ్డు నిర్మాణంతో పాటు టోల్ గేట్ సమీపం వరకు ఫ్లైఓవర్ వేయనున్నారు. రాజీవ్ రహదారి టోల్ గేటు సమీపం నుంచి మర్పడగ రోడ్డు వైపు సుమారు 150 ఫీట్ల వెడల్పుతో హైవే నిర్మించనున్నట్లు సమాచారం. అందుకోసం అధికారులు హద్దులు గుర్తించారు. దీనిపై భూములు కోల్పోతున్న రైతులు ఆందోళన గురవుతున్నారు. పలువురు రైతులు అక్కడికి చేరుకుని అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో నేషనల్ హైవే ఏఈ కరుణ, డివిజనల్ సర్వేయర్ వంశీ, మండల సర్వేయర్ గణేష్, ఆర్ఐ బాలకృష్ణ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల కుమ్మక్కు రాజకీయాలు

● మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

గజ్వేల్, ఫిబ్రవరి 11(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ కుమ్మక్కు రాజకీయాలకు పాల్పడుతున్నాయని ఖైరతాబాద్ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆరోపించారు. గజ్వేల్ పట్టణంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీజేపీని ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓడించడానికి బీఆర్ఎస్‌తో కాంగ్రెస్ పార్టీ కుమ్మక్కు అయిందన్నారు. బీఆర్ఎస్ నాయకులపై విచారణ జరుపవచ్చని గవర్నర్‌కు రాష్ట్ర ప్రభుత్వం పంపించిన అర్జీని క్లియర్ చేసినప్పటికీ ప్రభుత్వం ఎందుకు అరెస్ట్ చేయడం లేదని ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం, ఈ-కార్ రేసింగ్, పాలమూరు-రంగారెడ్డిలలో అవినీతికి పాల్పడిన బీఆర్ఎస్ నాయకులను ఎందుకు వెనుకేసుకు వస్తున్నారని ప్రశ్నించారు. ఈ విషయమై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. త్వరలో జరుగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటుతుందని, మూడు ఎమ్మెల్సీ స్థానాలను బీజేపీ గెలుచుకుంటుందని ధీమా వ్యక్తం చేశారు. ఆయన వెంట బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్‌రెడ్డి, మదాడి జశ్వంత్‌రెడ్డి, రాంరెడ్డి, పట్టణాధ్యక్షుడు మనోహర్‌యాదవ్, మండలాధ్యక్షుడు పంజాల అశోక్‌గౌడ్, నాయకులు శివకుమార్, అరవింద్ తదితరులున్నారు.